


*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

*20-10-2015 మంగళవారం*

ఉదయం ఆరింటికి టెలిఫోన్ అలారం మోగగానే నిద్రలేచాం. ఏడింటికి బ్రేక్‌ఫాస్ట్ హాల్‌లోకి వెళ్ళాం. వేయించిన కూరగాయలు, చిన్న బన్, జామ్, తాజా కూరగాయలు, సలాడ్, టీ , కాఫీ లైట్ బ్రేక్‌ఫాస్ట్ తీసుకుని (తప్పదు కాబట్టి) 7.25కల్లా సామానుతో లాబీలోకి వచ్చాం. జోర్డాన్‌లో మాకు ఎస్.ఓ.టి.సి అవుట్ సోర్స్ చేసిన ప్లాజా టూర్స్ మనిషి వేన్‌తో వచ్చాడు. డ్రైవర్ అతనే. తలత్. వేన్‌లో సామాను పెట్టిన బెల్ బాయ్‌కి రెండు సూట్‌కేస్‌లకి రెండు డాలర్స్ టిప్‌ని ఇచ్చాను. పైగా ఇది హోటల్స్‌లో సాధారణ సాంప్రదాయం. మనం ఖర్చు చేసే దాంట్లో అది ఎన్నోవంతు? మిగతా ఎవరూ ఇవ్వకపోవడంతో వాళ్ళవంక చూసే అతని కళ్ళల్లో నాకు కోపం కనిపించింది.

ఉదయం 7-50కి అమ్మన్‌లోని క్వీన్ అలియా ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్‌కి మా వేన్ బయలుదేరింది. మా తర్వాతి గమ్యం ఈజిప్ట్. దారిలో మినిస్ట్రీట్ ఆఫ్ పొలిటికల్ అండ్ పార్లమెంటరీ ఎఫైర్స్ కార్యాలయం. ఇతర ప్రభుత్వ కార్యాలయాల బిల్డింగ్స్ కనిపించాయి. వీధుల పేర్లు, షాప్స్ పేర్లు అరబిక్, ఇంగ్లీష్ భాషల్లో రాసి ఉన్నాయి. నేషనల్ సెంటర్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఆఫీస్ కనిపించింది. ఐదంతస్థులు మించిన భవంతులు కనపడలేదు. చిన్న సొరంగం దాటి ఏర్‌పోర్ట్‌కి చేరుకున్నాక దిగి ట్రాలీల్లో మా సామాను పెట్టుకున్నాం.

అక్కడ మా కోసం ఎదురు చూస్తున్న జిహాద్ కనిపించాడు. మమ్మల్ని వేచి ఉండమని, ఓ తెల్లవాళ్ళ బృందం వచ్చేదాకా ఆగాడు. ఐతే వాళ్ళు వచ్చాక మాకు ఈజిప్ట్ ఎయిర్ వేస్ కౌంటర్ ఎక్కడుందో చూపించి, తను ఇజ్రాయెల్ వెళ్ళే ఆ అమెరికన్స్ వెంట వెళ్ళిపోయాడు. ఓ చోట ఈ భద్రతా హెచ్చరిక కనిపించింది. 'మీరు తుపాకులు కానీ, పేలుడు పదార్థాలు కానీ తీసుకువెళ్తూంటే ముందుగా తెలియచేయండి. లేదా జోర్డాన్ చట్టప్రకారం మిమ్మల్ని అరెస్ట్ చేసి తగిన చర్యలు తీసుకుంటాం.'

క్యూలో మా బృందంలో మేమే ముందున్నాం. ఏర్‌లైన్స్ కౌంటర్‌లోని ఆమె మా పేపర్ వీసా చూసి చెక్ చేయాలని ఆపేసింది. జిహాద్ కోసం చూస్తే అతను ఎక్కడా కనపడలేదు. ఆమె తనపై అధికారితో మాట్లాడి చివరికి మాకు కైరోకి బోర్డింగ్ పాస్‌లు ఇచ్చింది. మా పేపర్ వీసాని చెక్ చేయడంతో మా వెనక ఉన్న మా బృందంలోని మిగతా తొమ్మిది మందికీ ఆలస్యం లేకుండా బోర్డింగ్ పాస్‌లు ఇచ్చింది. మా బృందంలోని డాక్టర్ సింహాద్రి కుటుంబం ముగ్గురు బ్రిటిష్ సిటిజన్స్ కాబట్టి వాళ్ళకి ఈజిప్ట్‌కి వీసా అవసరంలేదు. అంతా ఇమిగ్రేషన్ కౌంటర్లవైపు నడిచాం. ఇమిగ్రేషన్ క్యూలో నిలబడ్డ నా దగ్గరికి జిహాద్ వచ్చి టిప్ ఇవ్వమని కోరాడు.

'టూరిజంలో పనిచేసే మీకు డ్రైవర్, గైడ్, హోటల్ బెల్ బాయ్స్‌కి తప్ప ఇంకెవరికీ టిప్ ఇచ్చే సాంప్రదాయం లేదని తెలీదా? మీరు మాకు అవసరానికి సహాయానికి లేనప్పుడు టిప్ ఎందుకు ఇవ్వాలి?' అని అడిగాను. అతని కళ్ళలో తక్షణం కోపాన్ని చూసాను. తర్వాత అగర్వాల్ కూడా తనని అతను టిప్ అడిగాడని, ఇవ్వనని చెప్పానని చెప్పాడు. సెక్యూరిటీ చెక్ పూర్తిచేసుకుని వెళ్ళగానే ఎదురుగా చాలా షాప్స్ కనిపించాయి.

అక్కడ ఓ దుకాణంలో ఒంటె చర్మంతో చేసిన రెండు ఒంటె బొమ్మలు బహుమతులుగా ఇవ్వడానికి 8.25 డాలర్లకి కొన్నాం. బురఖా వేసుకున్న ముస్లిమ్ అమ్మాయి బొమ్మ 3.25 డాలర్లు. 20 డాలర్స్ ఇచ్చాను. అర డాలర్‌కి సరిపడే దినార్లు ఇచ్చారు. అక్కడ నట్స్ అమ్మే కౌంటర్‌కి వెళ్ళి ఆ చిల్లర చూపించి ఏమిస్తావ్ అని అడిగితే కనీస ధర రెండు డాలర్లని చెప్పాడు. అతను నాకు కాంప్లిమెంటరీగా ఓ చిన్న చాక్లెట్‌ని ఇచ్చాడు. అతనికి ఆ దినార్లు ఇచ్చేసాను.

8.45కల్లా మా గేట్ నంబర్ 1045కి చేరుకున్నాం. కానీ మా ఫ్లైట్ నంబర్ ఎస్ 720 గేట్‌ని 116కి మార్చారనే ప్రకటన విని ఎస్కలేటర్‌లో కింది అంతస్థులోని అక్కడికి చేరుకున్నాం.

ఓ ఎయిర్‌పోర్ట్‌లో కొందరు ప్రయాణీకులు తమ బోర్డింగ్ కార్డ్‌లో చూపించే గేట్ నంబర్ 35లో కూర్చుని ఉండగా పబ్లిక్ ఎడ్రస్ సిస్టంలో ఇలా వినిపించింది.

"అసౌకర్యానికి క్షమాపణలు. డెల్టా ఫ్లైట్ 570 గేట్ నంబర్ 23కి మార్చబడింది."

వెంటనే ప్రయాణీకులు అంతా తమతమ సామానుతో గేట్ నంబర్ 23కి చేరుకున్నారు. కొద్దిసేపటికి మళ్ళీ పబ్లిక్ ఎడ్రస్ సిస్టంలో ఇలా వినపడింది.

"అసౌకర్యానికి మళ్ళీ క్షమాపణలు. డెల్టా ఫ్లైట్ 570 గేట్ నంబర్ 35కి మార్చబడింది. డెల్టా ఫిజికల్ ఫిట్‌నెస్ ప్రోగ్రాంలో పాల్గొన్నందుకు థాంక్స్."

ఆ విశాలమైన హాల్లో ఏబిసి గేట్లు ఉన్నాయి. ఎల్.జి పవర్‌స్టేషన్ అని రాసిన చోట అన్ని రకాల యుఎస్‌బి పోర్ట్స్ ఛార్జ్ వేసుకోడానికి ఉన్నాయి. బహుశా ఆ సౌకర్యాన్ని ఎల్.జి కంపెనీ అందించి ఉంటుంది. ఓ గంట ఫ్రీ వైఫై సౌకర్యం ఉంది. అంతర్జాతీయ ప్రయాణీకులకి ఈ సౌకర్యం ఇచ్చే ఏర్‌పోర్ట్స్ తక్కువ. చాలా ఏర్‌పోర్ట్స్‌లో నెట్‌లోకి లాగిన్ అవడానికి సెల్‌ఫోన్ నంబర్‌కి ఇంటర్నెట్ పాస్‌వర్డ్‌ని ఎస్ఎంఎస్ చేస్తారు. కానీ అంతర్జాతీయ ప్రయాణీకులకి లోకల్ నంబర్ ఉండడం అరుదు కాబట్టి అది అందరికీ సమానంగా అందే సౌకర్యం కాదు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కూడా ఇదే అసౌకర్యం. ఏర్‌పోర్ట్‌లో కొన్ని ఈ మెయిల్స్ చదివి, అనవసరమైనవి డిలీట్ చేసాను.

బోర్డింగ్‌కి 116 సి గేట్‌లోంచి మమ్మల్ని బయటకి అనుమతించారు. నా బోర్డింగ్ పాస్‌ని చూపించి బయటకి వచ్చాను. కొంతదూరంలో ఆగిన షటిల్ దగ్గరికి వెళ్ళి చూస్తే నా వెనక నిలబడ్డ పద్మజ రాలేదు. మా బృందంలోని పద్మజ వెనక నిలబడ్డ ఆరుగురు వచ్చి కోచ్‌లో కూర్చున్నారు. మళ్ళీ వెనక్కి వెళ్తే, డెస్క్ దగ్గర ఉన్న పద్మజ నాకు ఓ ఉద్యోగిని చూపించి తన పేపర్ వీసా చూపించినా, పాస్‌పోర్ట్ తీసుకున్నాడని, కోచ్‌లోకి వెళ్ళమని చెప్పాడు కానీ పాస్‌పోర్ట్ ఇవ్వడం లేదని చెప్పింది. అతన్ని ఎందుకిలా చేస్తున్నావు అని అడిగితే, నా పాస్‌పోర్ట్‌ని కూడా అడిగి తీసుకుని చూసి, వీసా పేపర్‌ని, పద్మజ పాస్‌పోర్ట్‌ని తిరిగి ఇచ్చాడు కానీ, నా పాస్‌పోర్ట్ ఇవ్వకుండా వెనక్కి తిరిగాడు. నేను అతన్ని గట్టిగా పిలిచి పాస్‌పోర్ట్ అడిగితే, 'సారీ' చెప్పి ఇచ్చాడు. అతని నవ్వుని చూసి కావాలని మా ఇద్దరి పాస్‌పోర్ట్‌లని ఇవ్వలేదని గ్రహించాను.

బస్ ఎక్కేప్పుడు, దిగేప్పుడు స్వల్పంగా చినుకులు పడ్డాయి.

విమాన ప్రయాణానికి మునుపు జరిగే తతంగం చాలా ఉంటుంది. పైలట్, కో - పైలట్ ఓ ప్రత్యేక ఎంట్రన్స్ ద్వారా ఎయిర్‌పోర్ట్ బిల్డింగ్‌లోకి ప్రవేశిస్తారు. ప్రతీ విమానాశ్రయంలో ఆక్యుపైడ్, నాన్ - ఆక్యుపైడ్ అనే రెండు ఏరియాలు ఉంటాయి. 'ఆక్యుపైడ్' ఏరియాలోకి వెళ్ళడానికి చెకింగ్ అవసరం. పైలట్‌కి, ఇతర కాక్ పిట్ సిబ్బందికి అక్కడ వైద్య పరీక్షలు జరుపుతారు. ఇది విమానప్రయాణానికి రెండు గంటల ముందు, కనీసం గంటలోపు జరగాలి. డాక్టర్ వారి బిపిని, పల్స్ రేట్‌ని, శరీరంలో ఎంత ఆల్కహాల్ ఉంది లాంటి పరీక్షలు నిర్వహిస్తాడు. ఏదైనా అనుమానాలు ఉంటే మరి కొన్ని పరీక్షలు నిర్వహిస్తారు. తర్వాత పైలట్‌కి ఫ్లైట్ అసైన్‌మెంట్‌ని ఇస్తారు. ఫ్లైట్ ఛీఫ్ స్టివార్డ్ ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ని తీసుకుంటాడు. ట్రిప్ పూర్తయ్యాక వాటిని తిరిగి అప్పచెప్పాలి. డాక్టర్ వాటిలోని మందుల

ఎక్స్‌పైరీ డేట్లని చూసి అవసరం ఉంటే పాతవి తీసి కొత్తవి ఉంచాలి. కో - పైలట్ బాధ్యత విమానానికి చెందిన డాక్యుమెంట్స్ పెట్టెని విమానంలోకి తీసుకెళ్ళడం. పైలట్ రూటింగ్ మేప్‌ని, చేరబోయే ఎయిర్ పోర్ట్ ఎప్రోచ్ ప్లేట్స్‌ని, వెదర్ రిపోర్ట్‌లని, గాలివేగాన్ని, దారిలోని టర్బులెన్స్‌కి అవకాశం ఉన్న ప్రాంతాలని పరిశీలించి, గమ్యానికి చేరే ఉత్తమమైన మార్గాన్ని ఎంచుకుంటాడు. అందుకు అవసరమైన ఇంధనాన్ని అంచనా వేసి అది విమానంలో ఉందో లేదో ఎక్కాక తణిఖీ చేస్తాడు. ఏమైనా అనుమానాలు ఉంటే డ్యూటీలోని మెటరాలజిస్ట్‌ని సంప్రదిస్తాడు.

కాక్‌పిట్ సిబ్బంది తరచు మారుతూంటారు కాబట్టి ఒకరితో మరొకరికి ఫ్లైట్‌కి ముందే పరిచయం కలగడానికి అనువుగా అంతా ఓ లాంజ్‌లోకి చేరతారు. ఛీఫ్ స్టివార్డెస్ ఎయిర్ హోస్టెస్‌లకి, స్టివార్డ్‌లకి తగిన సూచనలు ఇచ్చి ఆహార పదార్ధాలు మొదలైనవి విమానంలోకి సరిగ్గా ఎక్కాయో లేదో పర్యవేక్షిస్తుంది.

రష్యాలాంటి కొన్ని చోట్ల పైలట్ ప్రత్యేక మినీ బస్‌లో విమానం దగ్గర దిగి రన్‌వే మీది విమానం చుట్టూ నడిచి ఇన్‌స్పెక్ట్ చేస్తాడు. ఎట్టి పరిస్థితుల్లో విమానం సెన్సర్ మీద, ఇంజన్ వేన్స్ మీద, మరికొన్ని ముఖ్యభాగాల మీద మంచు పేరుకుని ఉండకూడదు. స్టేటిక్ ఎలక్ట్రిసిటీ డిశ్చార్జ్‌ని కూడా చెక్ చేస్తాడు. బ్రేక్ లైనింగ్, వీల్ స్టాప్ కండిషన్, ఇంజన్ ఎగ్జిట్ టైల్ గ్రూప్ జీరోకి సెట్ చేసి ఉందా లేదా లాంటి మరి కొన్ని ఇన్‌స్పెక్షన్స్‌ని చేస్తాడు. కాక్‌పిట్‌కి చేరుకున్నాక అందులో ఒక్క లైట్ కూడా వెలగడం లేదని రూఢి చేసుకుంటాడు. సమస్య ఏర్పడ్డప్పుడే లైట్ వెలుగుతుంది. ఎండ ఎక్కువగా ఉంటే ఆరెంజ్ రంగ్ కర్టెన్స్‌ని వేసుకుంటాడు.

విమాన సిబ్బంది మొత్తం ప్రయాణీకుల్లా ఇమిగ్రేషన్, సెక్యూరిటీ చెక్‌లని చేసుకుని విమానానికి చేరుకుంటారు.

మా విమానం ఈజిప్ట్ ఎయిర్ లైన్స్‌కి చెందింది. విమానంలో మా సీట్ నంబర్స్ 27 జె, కె. విండో, మిడిల్ సీట్లు. 10-20 బోర్డింగ్ అనౌన్స్ చేసారు. దినపత్రికలని ట్రేలో తెచ్చి ఏర్‌హోస్టెస్ అడిగిన ప్రయాణీకులకి ఇచ్చారు. 11.30కి విమానం గాల్లోకి లేవగానే, పైనించి నా మీదకి ఎర్రటి ద్రవంలాంటిది ఏదో పడింది. బహుశ ఆయిల్ అయి ఉండచ్చు. నా పక్కన కూర్చున్న అరబ్ అది గమనించి జేబులోంచి రెండు పేపర్ నేప్కిన్స్ తీసిచ్చాడు. ఏర్ హోస్టెస్‌కి ఫిర్యాదు చేస్తే సారీ కూడా చెప్పలేదు. భోజనంగా మాకు నాన్ వెజ్ ట్రే ఇస్తే, మేము ముందే వెజిటేరియన్ బుక్ చేసుకున్నాం అని చెప్పాను. విమానంలోకి వెజిటేరియన్ ట్రేలు రాలేదని చెప్పింది.

"విమానంలో మాంసాహారం తప్ప శాకాహారం ఎక్కించలేదని తెలిసిన శాకాహారులు ఎలా ఫీలవుతారు?" అడిగాను.

"నాకు తెలీదు." ఆమె చెప్పింది.

"మీకు తెలుసు. ఆకలిగా" నవ్వుతూ జవాబు చెప్పాను.

పచ్చికూరగాయ ముక్కలు ఉన్నాయని తెచ్చిచ్చారు. కంప్లైంట్ ఫాం అడిగి తీసుకుని ఆ విషయం ఫిర్యాదు చేసాను. వెజిటేరియన్ అయిన అగర్వాల్‌ని తర్వాత అడిగితే, తమకీ వెజ్ భోజనం ఇవ్వలేదని, జ్యూస్ మాత్రం ఇచ్చారని, ఫిర్యాదు చేయాలని తనకి తెలీదని చెప్పాడు.

నియమం ప్రకారం కంప్లైంట్ ఫారాన్ని ఆమె పైలెట్‌కి ఇస్తే అతను నా దగ్గరికి వచ్చి వివరం తెలుసుకోవాలి. 1978లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ని ఆడిట్ చేసేప్పుడు 'ఏర్ హోస్టెస్' నవల కోసం సేకరించిన సమాచారంలో ఇదొకటి. విమానంలో ఉండే ఫిర్యాదు ఫామ్స్ ప్రయాణీకుల నించి అందాక చింపి పారేయకుండా, దిగాక వాటిని లెక్క చెప్పి ఇవ్వాలనే నియమం కూడా ఉంది. ఐతే ఛైర్మన్‌కి అడ్రస్ చేసిన ఆ ఫిర్యాదుకి నా ఇ మెయిల్ అడ్రస్‌కి కానీ, పోస్టల్ అడ్రస్‌కి కానీ, ఫోన్‌కి కానీ ఎలాంటి సమాధానం రాలేదు. సాధారణంగా పంపే ఛైర్మన్ సంతకం అచ్చయిన రొటీన్ ఉత్తరం/ఈ మెయిల్ కూడా ఛైర్మన్ ఆఫీస్ వారు పంపలేదు. దీన్ని బట్టే ఈజిప్షియన్స్ ఎలాంటి వారో, వారిది పీస్ గ్లోబల్ ఇండెక్స్‌లో 143 సంఖ్య ఎలా అయిందో అర్థం చేసుకోవచ్చు. తెల్లవాళ్ళున్న ఏ దేశంలో ఇలా జరగదు. నా అనుభవంలో ఆసియా, ఆఫ్రికా దేశాల్లో బాధ్యతా రాహిత్యం అధికం.

కైరోకి చేరుకున్నామని పైలెట్ ప్రకటించాక పైనించి చూస్తే కింద అంతా ఎడారి, ఆ తర్వాత మట్టిరంగులో ఇళ్ళు కనిపించాయి. ప్రపంచంలోని కొన్ని విశిష్ట నగరాల గురించి చదివిన జాబితాలో కైరో ప్రపంచంలోని అతి మురికి నగరం అని చదివిన సంగతి గుర్తొచ్చింది. పైలట్ విమానాన్ని 12.35కి విమానం కైరో ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్‌లో రఫ్‌గా పెద్ద కుదుపుతో దింపాడు.

ఈజిప్ట్ ఎయిర్ లైన్స్‌లో పైలట్‌గా పనిచేసే అతనికి బహుశ అతని తల్లి ఇలా ఉత్తరం రాసి ఉంటుంది.

'జాగ్రత్త నాయనా! విమానాన్ని కాస్త నెమ్మదిగా, మరీ ఎత్తుకి తీసుకువెళ్ళకుండా నడుపు.'

విమానం దిగి టెర్మినల్ - 2లోకి నడిచాం. మేము అంతదాకా ఆఫ్రికా ఖండానికి రాలేదు. మేము కాలు పెట్టిన నాలుగో ఖండం ఆఫ్రికాలోని మొదటి దేశం ఈజిప్ట్. రెండో దేశం ఘూనా. జనవరి 2016లో ఆఫ్రికాలోని ఘూనాకి వెళ్ళి నలభైరోజులు ఉన్నాం. ఆరు ఖండాల ఇంగ్లీష్ స్పెల్లింగుల్లోని విశేషం తెలుసా? ఆ ఆరిటి స్పెల్లింగ్‌లోని మొదటి అక్షరం ఏదో చివరి అక్షరం కూడా అదే

***ఈజిప్ట్***

దీని పేరు అరబిక్ రిపబ్లిక్ ఆఫ్ ఈజిప్ట్. ఆఫ్రికా ఖండంలో యూరప్, ఆసియాలకి దగ్గర మెడిటరేనియన్ సముద్రతీరంలో ఈ దేశం ఉంది. జాతీయ భాష ఈజిప్షియన్ అరబిల్. ఆనాటి ప్రెసిడెంట్ అబ్దుల్ ఫతా ఎల్‌సిన్. ప్రధానమంత్రి షరీఫ్ ఇస్మాయిల్. క్రీ.పూ. 315నించి ఈ సామ్రాజ్యం ఉంది. బ్రిటన్ నించి 28-2-1922లో ఈజిప్ట్ స్వాతంత్ర్యం పొందింది. 23-7-1952లో తిరుగుబాటు జరిగి, 18-6-1953లో రిపబ్లిక్‌గా ఏర్పడింది.

నేటి రాజ్యాంగం 18-1-2014లో ఏర్పడింది. విస్తీర్ణం పదిలక్షల పదివేల చదరపు కిలోమీటర్లు. ఈ భూభాగంలోని నీటి వనరు భాగం 0.632శాతం. దేశ జనాభా 9కోట్ల 27 లక్షలు. కరెన్సీ ఈజిప్టియన్ పౌండ్ దీన్ని ఎల్.ఇగా రాస్తారు. రోడ్‌కి కుడివైపు డ్రైవ్ చేస్తారు. ఏకైక అధికార భాష లిటరరీ అరబిక్. ఈజిప్షియన్ అరబిక్ అందరూ మాట్లాడే భాష మాండలికాలు, తక్కువమంది మాట్లడే ఇతర భాషలు కూడా ఉన్నాయి. ప్రపంచంలోని అతి పురాతన దేశాల్లో ఈజిప్ట్ ఒకటని చెప్పచ్చు. ఎందుకంటే, ఈజిప్టియన్స్ దేశందాటి ఎక్కడికీ వలసపోలేదు. ఆక్రమణ దారుల వల్ల రెండు సార్లు వారి భాషని, ఓసారి మతాన్ని మార్చారు.

ఇది ఆఫ్రికా ఖండంలో ఈశాన్య ప్రాంతంలో, ఆసియాకి నైరుతి దిశలో ఉంది. ఈజిప్ట్ మిడిల్ ఈస్ట్‌కి చెందిన మెడిటరేనియన్ దేశం.

మిడిల్ ఈస్ట్ అనే జాగ్రఫీ పేరుని ఈజిప్ట్‌లోని బ్రిటీష్ మిలటరీ కమాండర్ రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సృష్టించాడు. మెడిటరేనియన్ సముద్రానికి దక్షిణ, తూర్పు తీరాల్లో గల దేశాలని మిడిల్ ఈస్ట్ అంటారు. మొరాకోనించి అరేబియన్ పెనున్సులా, ఇరాన్ దాకా ఉన్న దేశాలు మిడిల్ ఈస్ట్. టర్కీ, సైప్రస్, సిరియా, లెబనాన్, ఇరాన్, ఇరాక్ ఇజ్రాయెల్, వెస్ట్ బేంక్, గాజా స్ట్రిప్, జోర్డాన్, ఒమన్, యు ఏ ఈ, సౌదీ అరేబియా, కువైట్, బెహరిన్, ఖతార్‌లతోపాటు ఈజిప్ట్ కూడా మిడిల్ ఈస్ట్‌లోనే ఉంది. లిబియా, సూడాన్, టునీషియా, అల్జీరియా, మొరాకో, లావోస్, ఈజిప్ట్ నార్త్ ఆఫ్రికన్ దేశాలైనా వీటిని కూడా ఫారిన్ పాలసీ, మతం వల్ల మిడిల్ ఈస్ట్‌లో చేర్చారు.

పసిఫిక్ సముద్ర ప్రాంతంలోని దేశాలని (థాయ్‌లాండ్, సింగపూర్, మలేసియా మొదలైనవి) ఫార్ ఈస్ట్ అంటారు.

ఈజిప్ట్‌కి తూర్పున గల్ఫ్ ఆఫ్ అక్వాబా, ఈశాన్యంలో ఇజ్రాయెల్, గాజా స్ట్రిప్, దక్షిణాన సుడాన్, పశ్చిమంలో లిబియా ఉన్నాయి. చేతిరాత, వ్యవసాయం, ప్రభుత్వ నిర్వహణ, పట్టణీకరణల్లో ప్రాచీన ఈజిప్ట్‌లో అభివృద్ధి జరిగింది. గీజా మెట్రోపోలిస్, (పిరమిడ్స్) గ్రేట్ స్ఫింక్స్, ఇంకా మెంఫిస్, థెబిస్, కర్నక్, వేలీ ఆఫ్ కింగ్స్‌లోని శిథిలాలు దీని నాగరికతకి ప్రతీకలుగా నేటికీ నిలిచి ఉన్నాయి. గ్రీక్, పర్షియన్, రోమన్, అరబ్, ఒట్టోమన్, యూరప్ పరిపాలనలు దీనిమీద చూపిన ప్రభావాలకి ఈ దేశం తట్టుకుంది. దేశం మొత్తం క్రిస్టియన్ మతానికి

చెందినా 7వ శతాబ్దంలో ఇస్లాం రాజులు జయించడంతో ప్రజలు ఇస్లాంలోకి మారారు. వాళ్ళని ఇస్లాం రాజులు బలవంతంగా మార్చగలిగారు.

ఆఫ్రికాలో నైజీరియా, ఇథియోపియా తర్వాత ఎక్కువ జనసంఖ్య గల దేశం ఈజిప్ట్. ప్రపంచ జనాభాలో పదిహేనవ స్థానంలో ఉంది. నైలు నదీ తీరంలో, అంటే నలభైవేల చదరపు కిలోమీటర్ల మేర ఎక్కువ జనాభా నివశిస్తోంది. ఈజిప్ట్‌లో గల సహారా ఎడారిలో జనసంఖ్య చాలా తక్కువ. సగం జనాభా కైరో, అలెగ్జాండ్రియా, నైల్ డెల్టాలోని పెద్ద పట్టణాల్లో నివశిస్తున్నారు. టూరిజం, వ్యవసాయం, పరిశ్రమలు దీని ప్రధాన ఆదాయం.

2011లో తీవ్ర ప్రజా నిరసనతో దీని అధ్యక్షుడు హోస్నీ ముబారక్ గద్దె దిగాడు. తర్వాత ఎన్నికలు జరిగినా సంవత్సరం తర్వాత దేశం సైన్యం ఆధీనంలోకి వెళ్ళింది. సౌదీ అరేబియా, పర్షియన్ గల్ఫ్, యూరప్‌లలో 30 లక్షలమంది ఈజిప్షియన్స్ పని చేస్తున్నారు. 1970లో పూర్తయిన అశ్వాన్ హై డేమ్, ఫలితంగా ఏర్పడ్డ లేక్ నాజర్ వల్ల వ్యవసాయం అభివృద్ధి చెందింది. పిరమిడ్స్ ప్రధాన ఆకర్షణ. ఒరిజనల్ సెవెన్ వండర్స్ ఆఫ్ ది ఏన్షియంట్ వరల్డ్‌లో నశించిపోకుండా ఇంకా నిలిచి ఉన్నది ది గ్రేట్ పిరమిడ్ ఆఫ్ గీజానే. 2008లో కోటి 28 లక్షలమంది పర్యాటకులు ఈజిప్ట్‌ని సందర్శించారు. వారినించి 110కోట్ల డాలర్ల ఆదాయం లభించింది. 12శాతం ఉద్యోగాలు పర్యాటక రంగంలోనే ఉన్నాయి. 2011 తిరుగుబాటువల్ల పర్యాటక రంగం దెబ్బ తింది.

ప్రాచీన నాగరికతల్లో నైలు నది నాగరికత ప్రధానమైంది. పిరమిడ్స్‌నే కాక నేడు మనం ఉపయోగించే ఎన్నిటినో క్రీస్తు పూర్వం ఈజిప్ట్‌లోనే కనుక్కున్నారు.

365 రోజుల కేలండర్‌ని నైలు నది వరదల మధ్య కాలపరిమితిని కొలవడానికి ఈజిప్షియన్సే కనుగొన్నారు. రోజుని గంటలుగా విభజించింది కూడా ఈజిప్టియన్సే. ఒబిలిస్క్‌గా పిలవబడే స్థంభాల నీడతో 5వేల ఏళ్ళ క్రితమే రోజుని ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రంగా విభజించారు. నీటి గడియారాలని కూడా ఈజిప్టియన్సే కనుగొన్నారు.

ఇంకా అందంకోసం వారు కాటుకని కనుగొన్నారు. స్త్రీలు కంటికి కాటుకని దిద్దుకుని కానీ బయటకి వెళ్ళేవారు కాదు. బాదంపప్పు బూడిద, నల్లటి కాపర్ ఆక్సైడ్ మొదలైన వాటితో కాటుకని తయారుచేసేవారు. ఇంకా నోటి దుర్వాసనని పోగొట్టడానికి పిప్పర్‌మెంట్‌ని, లిపిని (బొమ్మలనే అక్షరాలుగా (హైరోగ్లిఫిక్స్) వాడి, ఆలయాల్లో గోడలమీద రాసేవారు) పాపరస్ కాగితాన్ని, నల్ల ఇంక్‌ని, ఎద్దుతో నాగళ్ళని దున్నించడం, నీటిపారుదల, పోలీస్ వ్యవస్థ, సర్జికల్ పరికరాలు, విగ్గులు, కాస్మాటిక్ మేకప్, మమ్మిఫికేషన్ ఇంకా క్రీస్తు శకం 4వ శతాబ్దంలో టూత్ పేస్ట్‌ని, మగవాళ్ళు గడ్డం గీయడాన్నికూడా ఈజిప్టియన్సే కనిపెట్టారు. పెరిగిన గడ్డం నిర్లక్ష్యానికి గుర్తుగా వీరు భావించేవారు. గడ్డం లేకపోతేణ నల్లులు, ఇతర వ్యాధులు వ్యాపించవు కాబట్టి ఆరోగ్యం కోసం గడ్డం గీసుకునేవారు. ప్రాచీన ఈజిప్టులో శారీరక శుభ్రతకి ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. ఈజిప్షియన్ పేలస్‌లో 4,000 ఏళ్ళ క్రితమే ఓ తలుపుకి చెక్కుతాళం ఉంది. రోమన్స్ దీనినించి లోహంతో తాళం కప్పులని తయారు చేయడం కనిపెట్టారు.

ఇమ్మిగ్రేషన్ కౌంటర్స్‌కి ముందే, స్థానిక స్టార్ టూర్స్‌కి చెందిన ఉద్యోగి చేతిలో 'ఎస్ఓటిపి' అని రాసిన బోర్డ్ పట్టుకుని కనిపించాడు. అతను తన పేరు అహ్మద్ అని చెప్పి, మా పాస్‌పోర్ట్‌లని అడిగి తీసుకున్నాడు. తన దగ్గరున్న జాబితాలోని పేర్లతో మా పాస్‌పోర్ట్‌లలోని పేర్లని సరిచూసుకుని మా పధ్నాలుగుమందికి ఈజిప్ట్ వీసా ఫారాలని ఇస్తే వాటిని నింపి ఇచ్చాం. వాటితో అతను బేంక్‌కి వెళ్ళి వీసా ఫీజ్ కట్టి వచ్చి వీసాలని అతికించిన మా పాస్‌పోర్ట్‌లని తెచ్చిచ్చి, మమ్మల్ని ఇమ్మిగ్రేషన్ క్యూలో బయటకి రమ్మని చెప్పాడు. ఇమ్మిగ్రేషన్ కౌంటర్లో మా పాస్‌పోర్ట్‌ల మీద ఇమ్మిగ్రేషన్ స్టాంప్ కొట్టారు. ఎయిర్‌పోర్ట్ ఆధునికమైంది కాదు. కన్వేయర్ బెల్ట్ నించి మా లగేజ్ తీసుకుని 12.45కి బస్‌లో మా హోటల్‌కి బయలుదేరాం. అహ్మద్ మా అందరికీ తలో వాటర్ బాటిల్‌ని ఇచ్చి, మైక్ అందుకుని చెప్పాడు.

"ఇప్పుడు లోకల్ టైం 12.46. కాబట్టి దయచేసి మీ వాచ్‌లని సరిచేసుకోండి. మీ హోటల్ గీజా అనే చోట పిరమిడ్స్‌కి చాలా దగ్గరగా ఉంది. స్థానికంగా నేను మీ టూర్ ఏర్పాట్లని చూస్తున్నాను. మీ డ్రైవర్ పేరు మిస్టర్ మేథాత్. మీ లోకల్ గైడ్ పేరు మిస్టర్ తారిక్. అతను రేపు మీకు కలుస్తాడు. సాయంత్రం 5-45కి మీరంతా హోటల్ లాబీలోకి వస్తే పిరమిడ్స్ దగ్గర జరిగే సౌండ్ అండ్ లైట్ షోకి తీసుకెళ్తాను. అప్పటిదాకా మీకు రెస్ట్. హోటల్‌కి మన ప్రయాణం గంటకి పైగా పడుతుంది. మీ ఒరిజనల్ ఫ్లైయిట్ టిక్కెట్స్ ఇస్తే మీ ఆన్‌వార్డ్ జర్నీని కన్‌ఫం చేస్తాను. టిక్కెట్లు ఫోటో కాపీ తీసుకుని హోటల్ ఇవ్వాలన్నది నియమం. పోలీసులకి హోటల్ వాళ్ళు మీ పేర్లని ఇస్తారు."

అతను మా నించి టికెట్స్ తీసుకున్నాడు.

రోడ్లు విశాలంగా, శుభ్రంగా ఉన్నాయి. ఐతే ఇవన్నీ ప్రధాన వీధులు కాబట్టి. మేం చూసిన మిగతా ప్రాంతాలు మురికి నీటికాలువలతో, చెత్తతో నగరం మన దేశంలోని నగరాల్లా అశుభ్రంగా ఉంది. ప్రతీ ఇల్లు, అపార్ట్‌మెంట్ రంగు కనపడకుండా దుమ్ముకొట్టుకుపోయి ఇసకధూళి వల్ల ఇసక రంగులో కనిపించాయి. ఓ చోట ఇళ్ళని చూపించి అహ్మద్ చెప్పాడు.

"ఇది కైరోలోని అతి ఖరీదైన ప్రదేశం. ఈ రోడ్ పేరు సలాహుస్సేన్ రోడ్ విఐపిలు, ధనవంతులు, మినిస్టర్స్ ఇళ్ళు ఇక్కడ ఉంటాయి. ఇది కైరోలో అతి పొడవైన రోడ్డు. 26-28 మైళ్ళు సాగుతుంది. ఎడమ వైపుది ఫైవ్ స్టార్ హోటల్ షెరటన్. ఇక్కడ 120 చదరపు మీటర్ల అపార్ట్‌మెంట్ షుమారు 60 లక్షల ఈజిప్షియన్ పౌండ్స్ ఉంటుంది. ఇక్కడి కరెన్సీ ఈజిప్టియన్ పౌండ్ గుర్తు ఎల్ ఇ. అంటే, లివ్రే ఈజిప్షియనే. అది ఫ్రెంచ్ భాష.

"మీరు ఈ సమయంలో రావడం మీ అదృష్టం. కైరోలో ఇప్పుడు ట్రాఫిక్ ఉండని సమయం. ఇంకో గంట తర్వాత స్కూల్స్ వదిలే టైంలో ట్రాఫిక్ రద్దీ బాగా పెరుగుతుంది. కైరో ట్రాఫిక్ చూసాక చంద్రుడి మీదకి వెళ్ళడం తేలిక, భూమి మీద ప్రయాణించడమే కష్టం అనిపిస్తుంది. ఉదయం 8-10 మధ్య ట్రాఫిక్ చాలా రద్దీగా ఉంటుంది. మళ్ళీ మధ్యాహ్నం స్కూల్స్ విడిచే 2-30 నించి 3-30 సమయందాకా. సాయంత్రం 6 నుంచి 8.30దాకా కూడా ట్రాఫిక్ ఎక్కువ.

"మీ కుడివైపు స్కూల్ దగ్గర ఆపి ఉన్న వాహనాలని చూడండి. ట్రాఫిక్ జామ్ మొదలవుతోంది. ఇక్కడ స్కూల్ టైమింగ్స్ ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2, 2.30దాకా. సగం రోజైతే ఉదయం 8నుంచి 11.30 దాకా. లేదా 11.30నుంచి 3 దాకా. నాలుగున్నరేళ్ళకి స్కూల్లో చేర్చుకుంటారు అధికార భాష అరబిక్. అమెరికన్ స్కూల్స్, ఫ్రెంచ్ స్కూల్స్ కూడా చాలా ఉన్నాయి. ఇక్కడ 20శాతం మంది కేథలిక్ క్రిస్టియన్స్, 80శాతం మంది ముస్లిమ్స్ ఉన్నారు కాబట్టి మీకు మసీదులు అధికంగా కనిపిస్తుంటాయి. మసీదులకి మినారెట్స్ ఉంటాయి. రెండు, నాలుగు, ఆరు లేదా ఎనిమిది. ఇలా దాని సైజ్‌ని బట్టి అవి ఉంటాయి. కైరోకి 'సిటీ ఆఫ్ థౌజండ్ మినారెట్స్' అని ముద్దుపేరు. ఎడమవైపు ఆ పెద్ద ఇంటిని చూడండి. దాని పేరు 'పర్మ పేలస్' డ్రాకులా సినిమాని ఆ ఇంట్లోనే తీసారు. కుడివైపు మిలటరీ అకాడమీ. కుడివైపు ఎం అన్న బోర్డుని చూడండి. మెట్రో స్టేషన్ బయట గుర్తుగా ఆ బోర్డులు ఉంటాయి. ఎడమవైపు సెమెట్రీని చూడండి. అది ప్రపంచంలోని అతి పెద్ద సెమెట్రీ. దీన్ని సిటీ ఆఫ్ ది డెడ్ అని పిలుస్తారు. అక్కడి సమాధుల్లో ఏభై లక్షలమంది బీదవాళ్ళు నివశిస్తున్నారు. ప్రభుత్వం వారికోసం ఈ సెమెట్రీలో స్కూళ్ళు కూడా నడుపుతోంది. కుడివైపు ఉన్నది అలబస్టర్ మసీదు. ఈజిప్ట్ జనాభాలో బీదవారి సంఖ్య అధికం. అందుకని పేదల ఇళ్ళే ఎక్కువగా కనిపిస్తాయి. పొల్యూషన్ వల్ల ఇంటికి వేసిన రంగు పోతూంటుంది. అందుకని ఎవరూ రంగులు వేయించరు."

బయట సిమెంట్ చేయకపోవడంతో ఎర్రటి ఇటుకరాళ్ళ అపార్ట్‌మెంట్స్ నగరాన్ని అందవిహీనంగా చేస్తూ కనిపిస్తున్నాయి. బాల్కనీల్లో ఆరేసిన బట్టలు కనిపించాయి.

"ఈజిప్ట్‌లో మూడు రకాల పెట్రోల్ లభిస్తుంది. వాటి గ్రేడ్‌ని బట్టి 2, 2-50, 4 పౌండ్స్. ఇక్కడ అమెరికా, జపాన్, జర్మనీల నించి దిగుమతైన కార్లు ఎక్కువ. ఈజిప్ట్ జనాభాలో ఐదోవంతుకి పైగా, అంటే రెండు కోట్ల మంది పైగా కైరోలోనే నివశిస్తున్నారు. అంటే ప్రతీ ఐదుగురు ఈజిప్షియన్స్‌లో ఒకరు కైరోలోనే నివశిస్తున్నారు. డౌన్ టౌన్‌లో అతి ఎత్తయిన భవంతి ఉంది."

కొంత దూరం వెళ్ళాక ఎడమవైపు పేవ్‌మెంట్ మీద మనదేశంలోలా కుండలు, మట్టితో చేసిన ఒంటె బొమ్మలు, ఫ్లవర్ పాట్స్ మొదలైనవి ఉంచి అమ్ముతున్నారు. ఆ ప్రాంతం ఇలాంటి వాటికి ఫేమస్ అని అహ్మద్ చెప్పాడు. మా బస్ ఓ వంతెన మీదికి రాగానే అది నైల్ నది అని, కుడివైపు దూరంగా గల చిన్న ద్వీపంలో చర్చ్, మాస్క్ ఉన్నాయని చెప్పాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*